జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 4-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 634 పేజీలు: 4 వెల : రూ.7

## కలెక్టర్ క్యాంపు ఆఫీస్ వెనుకే..
# నిబంధనల ఉల్లంఘన





* హయతీనగరంలో ఇసుక దోపిడీ.. మూడు ప్రోక్లెయిన్లతో నది గుల్ల
* వందలాది లారీలతో విశాఖకు తరలింపు
* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టిలో సైతం లేదు
* అలాగని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావుకు సమాచారం లేదు
* ఏకంగా రాష్ట్ర మంత్రి పేరు చెప్పి అడ్డగోలు తవ్వకాలు
* నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు
* డీసిల్టేషన్ పేరుతో పక్కదోవ పట్టించే ప్రయత్నం
* పట్టించుకోని అధికార యంత్రాంగం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 3 (వార్త):** జిల్లా పరిపాలనా అధికారి నివసించే 'కలెక్టర్ క్యాంప్ ఆఫీస్' వెనుక భాగంలోనే ఇసుక మాఫియా పడగవిప్పింది. శ్రీకాకుళం నగరంలోని హయతీనగరం, తోటపాలెం పంచాయతీ పరిధిలో ఎన్జీటీ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. నదికి ఒకవైపు దమ్మలవీధి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో పర్యావరణ నియమాలు కాగితాలకే పరిమితమయ్యాయి.

### కళ్లముందే యంత్రాల విధ్వంసం!

నదీ గర్భంలో భారీ యంత్రాల వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ, హయతీనగరం వద్ద మూడు భారీ ప్రోక్లెయిన్లు నిరంతరం ఇసుకను తోడేస్తున్నాయి. క్యాంప్ ఆఫీస్ నుండి ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇక్కడి నుండి ప్రతిరోజూ వందలాది లారీలు ఇసుకను విశాఖపట్నం వైపు తరలిస్తున్నాయి. సామాన్యుడికి ఇసుక దొరకడమే కష్టంగా ఉన్న తరుణంలో, ఇంత భారీ ఎత్తున ఇతర నగరాలకు తరలిపోతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### మంత్రి పేరుతో హల్చల్..

ఈ అక్రమ తవ్వకాల వెనుక రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేరును కొందరు వ్యక్తులు వాడుకుంటున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలను సైతం బేఖాతరు చేస్తున్నట్లు పక్కాగా సమాచారం. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నడికుడిటి ఈశ్వరరావును సైతం అక్రమార్కులు లెక్క చేయడం లేదు. ఇది అటు ప్రభుత్వానికి, ఇటు పార్టీకి తీవ్రంగా చెడ్డపేరు తెస్తోంది. గొండు శంకర్ నియోజకవర్గం కూడా ఇదే. నదికి మరోవైపు ఉన్న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ నియోజకవర్గ పరిధిలో ఈ వ్యవహారం జరుగుతున్నా, కనీసం ఆయనకు కూడా ఈ తవ్వకాలపై సమాచారం లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కేవలం 'పెద్దల' పేరు చెప్పి స్థానిక ప్రజాప్రతినిధులను సైతం పక్కన పెడుతున్నట్లు తెలుస్తోంది.

### డీ-సిల్టేషన్ పేరుతో మభ్యపెట్టడం!

ఎవరైనా ప్రశ్నిస్తే "ఇది ఇసుక తవ్వకం కాదు.. డీ-సిల్టేషన్ (పూడిక తీత)" అని చెబుతూ బుకాయిస్తున్నారు. కానీ, వాస్తవానికి అక్కడ జరుగుతున్నది భారీ మైనింగ్ అని, దీనివల్ల నదీ ప్రవాహం దిశ మారి దమ్మలవీధి తీర ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ అక్రమాలపై వివరణ కోరేందుకు మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహనరావును పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించినా ఆయన ఫోన్ ఎత్తడం లేదు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సమాధానం చెప్పాల్సిన అధికారులు ఇలా మౌనం వహించడం వెనుక అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి.

### నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఏం చెబుతోంది..

నదీ గర్భాల్లో ఇసుక తవ్వకాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అత్యంత కఠినమైన నిబంధనలను అమలు చేస్తోంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండేందుకు నదుల్లో భారీ యంత్రాలైన ప్రోక్లెయిన్లు, జేసీబీల వినియోగాన్ని ఎన్జీటీ పూర్తిగా నిషిద్ధం చేసింది. కేవలం కూలీల ద్వారా మాత్రమే తవ్వకాలు జరపాలని, అది కూడా నిర్ణీత లోతుకు మించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఒకవేళ ఈ నిబంధనలను అతిక్రమించి యంత్రాలతో తవ్వకాలు జరిపితే, అది పర్యావరణ విధ్వంసం కిందకు వస్తుందని, ఇందుకు బాధ్యులైన అధికారులపై వ్యక్తులపై భారీ జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్జీటీ గతంలో పలు సంచలన తీర్పులు ఇచ్చింది. హయతీనగరం వద్ద బహిరంగంగా మూడు ప్రోక్లెయిన్లు పెట్టి తవ్వుతున్నా అధికారులు స్పందించకపోవడం ఈ నిబంధనల ఉల్లంఘనే అవుతుంది. కలెక్టర్ నివాసం వెనుకే జరుగుతున్న ఈ ఇసుక తవ్వకాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. నిబంధనల పేరుతో సామాన్యులను ఇబ్బంది పెట్టే అధికారులు, బహిరంగంగా సాగుతున్న ఈ యంత్రాల విధ్వంసంపై ఎందుకు మౌనం వహిస్తున్నారో శ్రీకాకుళం నగర పౌరులకు, అటు తోట పాలెం పంచాయతీ వాసులకి సమాధానం చెప్పాలి. ప్రస్తుతం తోటపాలెం కూడా శ్రీకాకుళం నగర పరిధిలోనే ఉంది. అలాంటప్పుడు శ్రీకాకుళం ఎమ్మెల్యే కూడా తెలియకుండా పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు చేస్తున్న వారిని ఎవరు అడ్డుకుంటారో చూడాలి.




## గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిపై దాడి




**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 3 (వార్త):** ఇచ్ఛాపురం వెంకట సిద్ధ భైరవి ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి వజ్రపు వెంకటేష్‌పై దాడి జరిగింది. శుక్రవారం ఏఎస్‌పేటకి చెందిన మన్యాల విగ్నేష్ అనే వ్యక్తి గ్యాస్ సరఫరా సమస్యపై ఆగ్రహంతో కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ ప్రతినిధి వెంకటేష్‌తో మాట్లాడుతున్న సమయంలో నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతో సహనం కోల్పోయి అతనిపై దాడికి పాల్పడ్డాడు. ఇప్పటికే పట్టణంలో గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రంగా ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కమర్షియల్ గ్యాస్ అందక హోటళ్లు, టీ దుకాణాలు మూతపడి ఐదు రోజుల దాటుతున్న చీమ కుట్టినట్లు కూడా స్పందించడం లేదు. గృహ వినియోగానికి కూడా డొమెస్టిక్ సిలిండర్లు సకాలంలో అందకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. సాక్ష్యాత్తు జిల్లా కలెక్టర్‌కి నేరుగా ఫిర్యాదు చేసిన అధికారులు గ్యాస్ ఏజెన్సీ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ప్రజలు ఇబ్బందులు పరిష్కరించాలని ఈ సమస్య ఓ కొలిక్కి తెచ్చి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇరాన్ - అమెరికా యుద్ధం కాస్త ఇచ్ఛాపురం - ఇండెన్ గ్యాస్ యుద్ధంలా మారినట్లు అనిపిస్తోంది.


## హోటళ్లపై విజిలెన్స్ దాడులు

**పలాస, ఏప్రిల్3 (వార్త):** పలాసలో గ్యాస్ అక్రమ దందాపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఉక్కుపాదం మోపారు. హోటళ్లు, బేకరీలను లక్ష్యంగా చేసుకుని ఆకస్మికంగా నిర్వహించిన దాడుల్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల దుర్వినియోగం బయటపడింది. ప్రభుత్వ నియమాలను బేఖాతరు చేస్తూ, కమర్షియల్ అవసరాలకు గృహ వినియోగ సిలిండర్లను ఉపయోగిస్తున్న దందా బట్టబయలైంది. విజిలెన్స్ బృందం నిర్వహించిన తనిఖీల్లో బుడాపెస్ట్ హోటల్‌లో రెండు, ఒక స్వీట్స్ బేకరీలో రెండు, ఇండస్ట్రియల్ ఏరియాలోని మరొక హోటల్‌లో మరో రెండు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఆరు సిలిండర్లలో నాలుగు హెచ్‌పి గ్యాస్, రెండు భారత్ గ్యాస్ సిలిండర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. గృహ వినియోగానికి మాత్రమే ఉద్దేశించిన సబ్సిడీ గ్యాస్‌ను వ్యాపార అవసరాలకు మళ్లించడం వల్ల ప్రభుత్వానికి నష్టం వాటిల్లడంతో పాటు సాధారణ ప్రజలకు సిలిండర్ల కొరత ఏర్పడుతున్నదని అధికారులు స్పష్టం చేశారు. విజిలెన్స్ సీఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ "డొమెస్టిక్ గ్యాస్‌ను కమర్షియల్ అవసరాలకు వినియోగించడం తీవ్రమైన నేరం. ఇలాంటి అక్రమాలు ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. ఇకపై పలాస-కాశీబుగ్గ ప్రాంతంలో మరింత విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు అతిక్రమించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

## వార్డుల పెరుగుదలతో..
# ఆశావహులలో నూతనోత్సాహం



* ఇచ్ఛాపురంలో 28కి పెరగనున్న వార్డులు
* వార్డుల రిజర్వేషన్లు కూడా మారే అవకాశం




**ఇచ్ఛాపురం ఏప్రిల్ 3 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో వార్డుల సంఖ్య 23 నుండి 28కి పెరగనుంది. ఈ మేరకు ముసాయిదా ప్రతిపాదన సిద్ధం చేస్తున్నారు. 1986 మార్చి15న ఇచ్ఛాపురం మున్సిపాలిటీగా అవతరించింది. ఇచ్ఛాపురం, రత్తకన్న, అమీన్ సాహెబ్ పేట, పురుషోత్తపురం పంచాయతీలు విలీనం చేసి మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. 1987లో తొలిసారి ఎన్నికలు జరగగా అప్పటికి 20 వార్డులు ఉండేవి. 1994, 2000 ఎన్నికల అనంతరం 2005 తర్వాత వార్డుల పునర్విభజనతో 23కి పెరిగింది. 2011 జనాభా లెక్కలు ప్రకారం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ జనాభా 36,493 మంది ఉండగా, పురుషులు 17,716, మహిళలు 18,777. కోవిడ్ కారణంగా జనగణన జరగలేదు. 2021 మున్సిపల్ ఎన్నికలు నాటికి మున్సిపల్ ఓటర్లు 27,831 మంది. పురుషులు 13,441, స్త్రీలు 14,383. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మున్సిపల్ అర్బన్ ఓటర్లు 30,410 మంది. పురుషులు 14,484, స్త్రీలు15,918మంది. ప్రస్తుతం కొత్త పునర్విభజన ప్రకారం 40 వేల లోపు జనాభా ఉంటే 28 వార్డులకు పెంచారు. 50 వేలు లోపు ఉంటే 32 వార్డులకు పెంచారు. వాస్తవానికి ఇచ్ఛాపురం మున్సిపాలిటీ జనాభా 40 వేలు దాటి ఉండవచ్చు. కానీ 28 వార్డులకు పరిమితం చేసి ముసాయిదా నోటిఫికేషన్ సిద్ధం చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 9 వరకు ముసాయిదా సిద్ధం చేసి 10 నుండి 16 లోపు నోటిఫికేషన్ విడుదల చేసి ప్రజలు నుంచి రాజకీయ పార్టీల నుండి అభ్యంతరాలు సూచనలు స్వీకరిస్తారు. 25లోపు తుది రూపం ఏర్పాటు చేస్తారు. మే 2 లోపు అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని మే3 నుండి 5 లోపు ఫైనల్ గెజిట్ విడుదల చేస్తారు. ఇదిలా వుండగా ఒక్కసారిగా 5 వార్డులు పెరుగుతుండటంతో ఆశావహులలో కొత్త ఆశలు చిగురించాయి. కొంత మందికి రాజకీయ, సాంకేతిక సమీకరణాలతో వార్డులు దక్కవనే బెంగ నుంచి ఉపశమనం కలుగుతుంది. మరో వైపు వార్డు విభజన వల్ల ఓటర్లు సంఖ్య కాస్త తగ్గడంతో ఎన్నికల ఖర్చు కూడా ఆదా అవుతోంది. కొంత మంది వార్డులో బలం లేకపోయినా ఓటమి భయం ఉన్న పక్క వార్డుల వైపు కన్నెత్తి చూడొచ్చు అనే ఆలోచనలో ఉన్నారు. 1,2,3 వార్డుల పరిధిలో 1 వార్డు, 3, 23 వార్డుల పరిధిలో 1వ వార్డు, రత్తకన్న 18,19 ,20 వార్డు ల పరిధిలో 1వ వార్డు, 5, 11వార్డుల పరిధిలో 1వ వార్డు బెల్లు పడా 12,13,14 వార్డు ల పరిధిలో 1 వార్డు పెరగవచ్చునని భావిస్తున్నారు. ఎన్టీఆర్ కాలనీలు కొత్త కాలనీల వల్ల ఓటర్లు పెరిగినప్పటికి వీరంతా ఏదో వార్డులో ఓటర్లుగా వుండే ఉంటారు. భౌగోళికంగా వార్డుల విభజన ప్రకారం ఎన్టీఆర్ కాలనీ సంతపేట, జర్నలిస్టుల కాలనీ, కొండపోలమ్మ కాలనీ గాంధీ నగర్ ఇలాంటి ప్రాంతాలు ఉన్న 15,17 వార్డులు ఏదో ఒక వార్డు లోకి వస్తాయి. మొత్తం మీద 5 వార్డులు పెరుగుతుండటంతో పాటు రిజర్వేషన్ ప్రక్రియ కూడా మారొచ్చు. ఈ క్రమంలో వార్డుల రిజర్వేషన్లు కూడా మారే అవకాశాలు ఉన్నాయి.

# అమరావతి చట్టబద్ధత ఆంధ్రుల ఆత్మగౌరవానికి భద్రత



**శ్రీకాకుళం, ఏప్రిల్ 3(వార్త):** ఆంధ్రుల అభిమాన ఏకైక రాజధాని అమరా వతి అని ..దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ముక్తకంఠంతో ఎలుగెత్తి చాటి, పార్లమెంట్ సాక్షిగా మద్దతు ఇచ్చి అండగా నిలిచి సహకరించారని టీడీపీ నేత మాదారపు వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన శ్రీకాకుళంలో విలేఖరులతో మాట్లాడారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వ పటిమకు, బిల్లు చట్టబద్ధతకు ఇదే నిదర్శనమని ఆయన కొనియాడారు. ఈ బిల్లును వ్యతిరేకించి, వాకౌట్ చేసిన వైసీపీకి ఇక రాష్ట్రంలో వాషవుట్ తప్పదన్నారు. ఈ బిల్లు చట్టబద్ధతకు సహకరించిన దేశ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి, బిల్లుకు మద్దతు తెలిపిన దేశంలోని అన్ని రాజకీయాలు పార్టీలకు, అమరావతి ప్రాంత రైతులకు, సోదరీమణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతీ కుటుంబ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



**మందస, ఏప్రిల్ 3(వార్త):** ప్రతీ కుటుంబం ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని సొండిపూడి పంచాయతీ అధ్యక్షుడు మిస్క గణపతి, తెలుగుయువత మండల అధ్యక్షుడు ఔగాన ఈశ్వరరావు, మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మల్లారెడ్డి భాస్కరరావు అన్నారు. శుక్రవారం వారు సొండిపూడిలో చెత్త సేకరణ ప్రత్యేక వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఇంటికి ఆరోగ్యమే లక్ష్యంగా ఎమ్మెల్యే గౌతు శిరీష పని చేస్తున్నారన్నారు. పారిశుద్ధ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతీ చేతికి పని.. ప్రతీ చేనుకు నీరు ప్రభుత్వ లక్ష్యమన్నారు. మారుమూల ప్రాంతానికి కూడా స్వచ్ఛ రథాన్ని అందిస్తున్న ఘనత ప్రభుత్వానిదేనన్నారు. స్వచ్ఛతతో ఆరోగ్యం లభిస్తుందని, ప్రజలు స్వచ్ఛందంగా ఇటువంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అల్లుమల నారాయణరావు, మద్ది సురేష్, గుడియా శ్రీనివాస్, బొల్ల లక్ష్మణరావు, చిచ్చుల దీపక్, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



**ఇచ్ఛాపురం ఏప్రిల్ 3 (వార్త):** శుభ శుక్రవారంలో భాగంగా స్థానిక ఆంధ్ర బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే శిలువ శాంతి యాత్ర నిర్వహించారు.. స్థానిక చర్చి పాస్టరు డాక్టర్ అబ్రహామ్, సీఐ మంగరాజు జెండా ఊపి ఈ యాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి డాక్టరు ప్రత్తి అన్వేష్, ఎస్ఐ మోహిని, చర్చి పెద్దలు నాగరత్నం, నవీన్ కుమార్, జోగారావు, చిరు, జనార్దన్ పాల్గొన్నారు.

## 5న గున్నమ్మ వీరత్వంపై కవిత, పద్య, పాటల పోటీలు



**మందస, ఏప్రిల్ 3(వార్త):** వీరనారి వీరగున్నమ్మ వీరత్వంపై కవితలు, పద్యాలు, పాటల పోటీలు ఈ నెల 5న హరిపురంలో గల స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీస్‌లో(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా) నిర్వహిస్తున్నట్టు ప్రజా విజ్ఞాన వేదిక, ప్రజా విజ్ఞాన సాహితీ కళావేదిక ప్రతినిధులు తెలిపారు. ఆమె 86వ వర్ధంతి సందర్భంగా సాహిత్య నివాళి అర్పిస్తున్నామన్నారు. కార్యక్రమానికి సభాధ్యక్షునిగా మార్పు జగన్మోహనరావు, కన్వీనర్‌గా సవర సోములయ్య, ముఖ్యఅతిథిగా బెందాళం కృష్ణారావు, గౌరవ అతిథిగా డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు హాజరవుతారన్నారు. వక్తలుగా మామిడి కోదండరావు, లోపింటి రజితేంద్రరెడ్డి పాల్గొంటారన్నారు. ఒక్కో విభాగంగా ప్రతిభ చూపిన కళాకారులు, రచయితలకు మెమొంటో, దుశ్శాలువాతో సత్కరిస్తామని, అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు తెలిపారు.

## మాజీ సర్పంచ్ త్రినాథ్ రెడ్డికి సన్మానం



**ఇచ్ఛాపురం ఏప్రిల్ 3 (వార్త):** టి.బరంపురం మాజీ సర్పంచ్ కారంగి త్రినాథ రెడ్డికి పదవీ కాలం పూర్తయిన సందర్భంగా కె.శాసనం గ్రామ ప్రజలు శుక్రవారం సన్మానం చేశారు. ఎంపీపీ బోర పుష్ప ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిపారు.

## సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు



**పోలాకి, ఏప్రిల్ 3(వార్త):** నరసన్నపేట నియోజకవర్గ ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పాల్గొన్నారు. ఈ దర్బార్‌కు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై భూసంబంధిత అంశాలు, పింఛన్లు, రేషన్, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి అనేక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వినతిపత్రాలు సమర్పించారు. ఆయన సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిపై వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా పరిపాలన అందించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.



# 'ప్రదీప్' పాలిట మృత్యుపాశమైన అడవి పంది



### -తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి
### -కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం
### -చీపి గ్రామంలో విషాదఛాయలు

**మందస, ఏప్రిల్ 3(వార్త):** అడవిపంది ఓ గిరిజన కుటుంబం పాలిట శాపంగా మారింది. ఆ కుటుంబం పెద్దకు మృత్యు దేవతగా నిలిచింది. మరికొద్ది సమయంలో ఇంటికి చేరుతాడనుకున్న ఆ గిరిజనుడు అందని లోకాలకు వెళ్లిపోయాడు. మందస మండలంలోని చీపి అనే గిరిజన గ్రామానికి చెందిన సవర ప్రదీప్, సవర సూర్యారావు బైక్‌పై ఒడిశాలో జరడా అనే గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యంలో కుల్లాడి అనే గిరిజన గ్రామం వద్ద హఠాత్తుగా పొదల్లో నుంచి ఓ అడవిపంది అడ్డంగా రావడంతో, దాన్ని ఢీకొని ఇద్దరూ తారురోడ్డుపై పడిపోయారు. ఇద్దరికీ తీవ్ర గాయాలవ్వగా, 108లో వీరిని హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో టెక్కలిలోని జిల్లా ఆసుపత్రి.. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రదీప్ మరణించారు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రదీప్ మరణించాడని తెలియగానే కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహం చీపి చేరుకోగా, గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



# అమరావతి బిల్లుకు ఆమోదం.. నరసన్నపేటలో వేడుకలు



**నరసన్నపేట, ఏప్రిల్ 3(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందిన సందర్భంగా నరసన్నపేటలో శుక్రవారం రాత్రి ఘనంగా వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం "జై అమరావతి" నినాదాలతో బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల దీర్ఘకాల కోరిక నెరవే రిందని, ప్రజా కలల రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. "జై అమరావతి, జై ఆంధ్రప్రదేశ్" నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రమించాడు.. సాధించాడు..!

### -పిడిమందస యువకుడు వంశీకి ఎస్బీఐలో ఉద్యోగం



**మందస, ఏప్రిల్ 3(వార్త):** శ్రమయేవ జయతే అన్నారు పెద్దలు. ఈ సామెతను ఓ యువకుడు అన్వయించుకున్నాడు. శ్రమించాడు.. బ్యాంకు ఉద్యో గం సాధించాడు. పిడిమందస యువకులు ఇటీవల మంచి ప్రతిభ చూపుతున్నారు. జిల్లా కలెక్టర్ నుంచి వివిధ హోదాలు కలిగిన ఉద్యోగాలు సాధిస్తున్నారు. బూరెల్లి వంశీ అనే యువకుడు ఎంతో కష్టపడి చదువుకుంటూ, పోటీ పరీక్షలను రాసి.. భారతీయ స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దీంతో ఆ గ్రామస్థులు వంశీ ప్రతిభకు ఫిదా అవుతున్నారు. వంశీని తల్లిదండ్రులు వెంకటరావు, కరుణ, తాతయ్య జయరాజు, మామయ్య అగ్గున్న నరేష్ తదితరులు అభినందించారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

### - ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, ఏప్రిల్ 3(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వ హిస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. పలాసలోని తన కార్యాలయం లో శుక్రవారం ఆమె ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలను ఓపికగా వింటూ వాటిని తక్షణమే పరిష్కరించే దిశగా తనదైన ముద్ర వేశారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆమె చూపిన చొరవ ప్రజలపై ఆమెకున్న అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఈ గ్రీవెన్స్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 54 వినతులు అందాయని పలాస ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది వెల్లడించారు. ప్రజల నుంచి ప్రధానంగా పెన్షన్లు, భూ వివాదాలు, ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మా ణాలు, సీసీ రోడ్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ప్రతి ఒక్కరి సమస్యను శిరీష ఓపికగా వింటూ కొన్ని సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు పంపి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలందరి సమస్యలు తీరేవరకు ఓపికగా సమాధాన మిచ్చి, వారికి పూర్తి భరోసా కల్పించి పంపించారు.




## నరసన్నపేట ప్రత్యేకాధికారిగా ప్రసాదరావు



**నరసన్నపేట, ఏప్రిల్ 4 (వార్త):** పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం గురువారంతో ముగియ డంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ నేపథ్యంలో నరసన్నపేట మేజర్ పంచాయతీకి స్పెషల్ ఆఫీసర్‌గా ఎంపీడీవో కేవీ ప్రసాదరావును నియమించారు. తాను శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

## ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు విడుదల



**పోలాకి, ఏప్రిల్ 4(వార్త):** ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసిన విద్యార్థులకు హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ పైడి ప్రవీణ తెలిపారు. విద్యార్థులు apms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు. ఈ నెల 12న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు.

## యలమంచిలి పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



**జలుమూరు, ఏప్రిల్ 3 (వార్త):** యలమంచిలి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గురువారం సాయంత్రం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం గొద్దు రఘునాథరావు మాట్లాడుతూ, గ్రామ మాజీ సర్పంచ్ మెండ రవికుమార్ తన సొంత నిధులతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతా యన్నారు. త్వరలోనే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నేడు వాసుదేవుని ఆలయంలో వైకాపా ప్రత్యేక పూజలు

**మందస, ఏప్రిల్ 3(వార్త):** మందస పట్టణంలోని శ్రీవాసుదేవ పెరుమాళ్ ఆలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు పార్టీ నాయకులు చెప్పారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తిరుమల పవిత్రతను కాపాడే దిశగా బీఆర్ నాయుడును వెంటనే ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో 4న(శనివారం) ఉదయం 9.30గంటలకు మందస వాసుదేవ పెరుమాళ్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. పలాస నియోజకవర్గానికి చెందిన వివిధ హోదాల్లో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## 12న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



**జలుమూరు, ఏప్రిల్ 3 (వార్త):** కరవంజ మోడల్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న 6వ తరగతి ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ నెల 12న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు https://apms.apcfss.in వెబ్‌సైట్‌లో తమ ఐడీ, పుట్టిన తేదీ వివరాలతో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 9440322964 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పలాసలో పోలీస్ యాక్ట్ అమలు

**- కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ**



**పలాస, ఏప్రిల్ 3(వార్త):** పలాసలో పోలీస్ యాక్ట్ అమలవుతుందని కాశీబుగ్గ సీఐ రామకృష్ణ తెలిపారు. పలాస కాశీబుగ్గ పట్టణ పరిధిలో ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని పలాస సీఐ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజాశాంతి, భద్రత పరిరక్షణ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. నియమాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# ఎండలు మండుతున్నాయి..!



**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**జలుమూరు, ఏప్రిల్ 3(వార్త):** జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరు గుతూ ఎండలు మండిపోతున్నాయి. రోహిణి కార్తె రాకముందే తీవ్రంగా ఎండలు ప్రారంభమవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుతుండగా, వడగాల్పులు కూడా ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లే వారు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కు వగా ఉన్న సమయంలో వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరం లేకుండా బయటకు వెళ్లకూడదని జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ కె.సుజాత సూచించారు. ఎండల తీవ్రత కారణంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా



ప్రభావితమవుతు న్నారని తెలిపారు. శరీరంలో నీటి లోపం రాకుండా తరచూ ద్రవాలు తీసుకోవా లని, ఏవైనా అస్వస్థత లక్షణాలు అయిన నీరసం, తలనొప్పి, డీహైడ్రేషన్ వంటి సమ స్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. కనిపిస్తే వెంటనే వైద్యు లను సంప్రదించాలని ఆమె తెలిపారు. ఎక్కువగా నీరు తాగడం, మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, తలపై గుడ్డ లేదా టోపీ ధరించడం ఓఆర్ఎస్, నిమ్మరసం వంటి ద్రవాలు తీసుకోవాలని ఆమె సూచించారు.

## సంస్కార సహిత చదువులందించడమే లక్ష్యం



**పలాస, ఏప్రిల్ 3(వార్త):** అసంస్కార సహిత చదువులు అందించడమే లక్ష్యమని శ్రీ సత్య సాయి విద్యా విహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశం పేర్కొన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ తెలుగు ఉపాధ్యాయ బృందం.. పద్యాల పోటీలను కంచిలి విద్యాశాఖ అధికారి చిట్టిబాబు జగన్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలో రామకృష్ణాపురములోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని గీతా మాధురి పాల్గొని ప్రప్రథమ స్థానములో నిలిచారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ సత్యసాయి విద్యావిహార్ లో చదువు కునే విద్యార్థి మానవతా విలువలతో కూడిన విద్యతోపాటుగా అన్ని రంగాలలో సమగ్రాభివృద్ధి చెందేలా వార్షిక ప్రణాళిక ఉంటుందని తెలిపారు. తనకు శిక్షణ ఇచ్చిన తెలుగు ఉపాధ్యాయులు సాంబమూర్తి, మురళి, జగదీశ్వరిలను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

## ధర్నాలు.. ర్యాలీలపై నిషేధం



**సోంపేట ఏప్రిల్ 3(వార్త):** సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున సోంపేట పోలీస్ సర్కిల్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు నిరసన కార్యక్రమాలపై నిషేధం ఉన్నట్లు సోంపేట సీఐ బి.మంగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్పీ కార్యాలయం ఉత్తర్వుల మేరకు ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, బహిరంగ సభలకు అనుమతి లేదన్నారు. ప్రజలు గుంపులుగా చేరరాదని తెలిపారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా ఒకచోట చేరడం చట్టరీత్యా నిషేధం. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సింగుపురంలో 80 మందికి అస్వస్థత

* బాదం పాలు తాగిన తర్వాత వాంతులు, విరోచనాలు
* ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు
* అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
* కలెక్టర్‌తో మాట్లాడిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, ఏప్రిల్ 3 (వార్త):** శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం గ్రామంలో 80 మంది అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో జరిగిన కొండమ్మ జాతరలో గ్రామస్థులు కొందరు బాదం పాలు తాగారు. ఆ తర్వాత కొందరు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలకు గురయ్యారు. అస్వస్థతకు గురైన వారు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ వెంటనే అప్రమత్తమైంది. ఇంటింటికీ వైద్యసిబ్బంది వెళ్లి వైద్యసేవలు అందించారు. సింగుపురం పీహెచ్‌సీకి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ వెళ్లి బాధితులను పరామర్శించారు. సింగుపురం పంచాయతీ మామిడివలస గ్రామంలో 25 కేసులు నమోదయ్యాయి. వారిలో కొందరిని మెరుగైన చికిత్సకు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జాతరలో బాదం పాలు ఎవరు విక్రయించారన్న దానిపై ఆరా తీశారు. సమాచారం అందుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో శుక్రవారం రాత్రి ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తొలుత ఇది అతిసారం అని భావించినప్పటికీ, అది ఆహారం వికటించడం వల్లే జరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. బాధితులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైతే ప్రత్యేక వైద్య బృందాలను గ్రామానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఆహారం ఎక్కడ వికటించింది, దానికి గల కారణాలు ఏమిటనే అంశాలను త్వరితగతిన గుర్తించి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.

## అమల్లో.. సెక్షన్ 30

* అనుమతి లేకుండా ధర్నాలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు
* ప్రజలు గుంపులుగుంపులుగా ఉండకూడదు
* శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద

**శ్రీకాకుళం, ఏప్రిల్ 3 (వార్త):** శ్రీకాకుళం సబ్-డివిజన్ పరిధిలో పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉన్నదని శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సి.హెచ్. వివేకానంద శుక్రవారం తెలిపారు. ఈ మేరకు, శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో పోలీసు శాఖ ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా ధర్నాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసనలు నిర్వహించకూడదన్నారు. ప్రజా శాంతి భంగం కలిగించే గుంపులుగా కూడే కార్యక్రమాలు నిర్వహించడం నిషేధించబడిందన్నారు. ప్రజలు ఎవరూ గుంపులుగా కూడి ఉండరాదని, సున్నితమైన ప్రదేశాలలో అనుమతి లేని కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. ఏ విధమైన సామాజిక, ధార్మిక, రాజకీయ, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలన్నా ముందస్తుగా పోలీసు అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు. శాంతి భద్రతల దృష్ట్యా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద కోరారు.

## నేషనల్ ఛాంపియన్‌ను అభినందించిన శిరీష



**పలాస, ఏప్రిల్ 3(వార్త):** ఇటీవల మంగళూరులో నిర్వహించిన మహిళా పవర్ లిఫ్టింగ్ 69 కేజీల మహిళా విభాగం -375కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన పలాస వాసి జరా సిద్విక్ దుశ్శాలువాతో శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తన కార్యాలయంలో అభినందించారు.

ఈమెను భర్త పలాస ఆర్టీసీ అసిస్టెంట్ ఇంజనీర్ హేమంత్ కిషోర్ ప్రోత్సహించి జాతీయ స్థాయికి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ ప్రపంచ స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరారు. ప్రోత్సాహకాలు ప్రభుత్వం నుండి పొందేందుకు తన వంతు ప్రయత్నిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.విఠల్, అగ్నికుల క్షత్రియ రాష్ట్ర డైరెక్టర్ కుత్తుమ లక్ష్మణ్, తెలుగుదేశం యువజన నాయకులు దువ్వాడ సంతోష్‌నాయుడు, ఇరిగేషన్ అధికారి పి.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ జి.రామ్మోహన్ రావు, ఏపీఎస్ఆర్టీసీ దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## రామనామ స్మరణతో మారుమోగిన రామాలయం


-చివరి రోజున భారీగా హాజరైన భక్తులు

-ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలకు సన్మానం

-భారీ స్థాయిలో అన్న సమా రాదన

-విజయవంతమైన కోదండరాముని నవమి ఉత్సవాలు

**సోంపేట, ఏప్రిల్ 3(వార్త):** సోంపేటలో వెలసిన శ్రీ కోదండరామ ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగి శాయి. తొమ్మిది రోజులు పాటు సాగిన ఈ ఉత్సవాలలో తొలిరోజు మొదలు ఆఖరి రోజు వరకు ఒక్కొక్క రోజు ఒక్కొక్క విశేష పూజా కార్యక్రమాలతో ఉత్సవాలను దేవాలయ అభివృద్ధి కమిటీ వైభవంగా నిర్వహించింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఈ ఆలయంలో నూతన ట్రస్ట్ కమిటీ ఏర్పాటుతో ఉత్సవాలను ఎంతో ఉత్సాహంగా భక్తిశ్రద్ధలతో ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించారు. ఆలయంలో సీతారాముల కళ్యాణం ఎంతో హైలెట్గా నిలిచింది. చివరి రోజు అయిన శుక్రవారం విశేష పూజలతో పాటు భారీ అన్న సమారాధన నిర్వ హించారు. సుమారు 4000 మంది భక్తులు హాజరై అన్న ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ హాజరయ్యారు. మాజీ మంత్రి గౌతు శివాజీ



కూడా హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు రమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి శేష వస్త్రాలతో ఇద్దరినీ సత్క రించారు. ట్రస్ట్ కమిటీ అధ్యక్షుడు బీన ఆనందరావు, కమిటీ సభ్యులు, పట్టణంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు స్వామివారి శ్రీరామ నవమి ఉత్సవాలలో ప్రతిరోజు జరిగే కార్యక్రమాల్లోనూ విశేష సేవలను అందించారు. ఉత్సవాలలో సేవలందించిన ప్రతి ఒక్కరికి ట్రస్ట్ చైర్మన్ ఆనందరావు కృతజ్ఞతలు తెలిపారు.

## శిలువ శాంతి యాత్ర



**సోంపేట ఏప్రిల్ 3(వార్త):** సోంపేటలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా సిలువ శాంతి యాత్రను నిర్వహించారు. శాంతియాత్రను చర్చి ఫాస్టర్ డాక్టర్ కొత్తపల్లి అబ్రహం ఆధ్వర్యంలో సీఐ మంగరాజు, ఎస్ఐ మోహిని జెండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ ప్రతి అన్వేష్ ముఖ్యఅతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. చర్చి పెద్దలు నాగరత్నం, నవీన్, కుమార్, జోగారావు, చిరంజీవి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని అమరావతి సంబరాలు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 3(వార్త):** రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్ట సభల్లో ఆమో దం లభించడంతో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో పార్టీ కార్యకర్తలు ప్రతినిధులు పాల్గొన్నారు. ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద బాణసంచా కాల్చి, కాగా డలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పత్రి తవిటయ్య, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి, సీపాన వెంకట రమణ, బెందాలం రమేష్, జగదీష్ పట్నాయక్, నందికి జానీ, చిత్రాడ శ్రీనివాస్, చంద్రశేఖర్, జన్నెల సంతోష్, పుల్లట రాజు తదితరులు పాల్గొన్నారు.

## శివాజీనగర్ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**పలాస, ఏప్రిల్ 3(వార్త):** శివాజీనగర్ ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టు బడి ఉందని టీడీపీ వార్డు ఇన్‌చార్జి పిట్ట రవికుమార్ తెలిపారు. ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో 20వ వార్డ్ శివాజీనగర్‌లో వీధిలో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభించారు. ఎంతో కాలంగా ఆగిపోయిన పనుల పరిస్థితిని వార్డ్ నాయకులు పిట్ట రవికుమార్ దృష్టిలో పెట్టిన వెంటనే స్పందించి, ఆ సమస్యను ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టిలో పెట్టి సుమారు రూ.8.50 లక్షలతో రోడ్డు, డ్రైనేజీ పనులను మంజూరు చేయిం చారు. దీంతో రవికుమార్‌కి శివాజీ ప్రాంతీయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్లగా వీధిలో ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి ఇరువైపులా వారిరిని ఒకతాటి పైకి తెచ్చి సమస్యను సామరస్యంగా మాట్లాడి పరిష్కారం చేయడంలో సఫలీకృతమ య్యారని శివాజీ నగర్ వాసులు కొనియాడారు. రోడ్లు డ్రైనేజ్ పనులు పూర్తి చేసి నందుకు గాను ఎమ్మెల్యే గౌతు శిరీషకి, శివాజీ నగర్ టిడిపి నాయకులు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మీ జవాన్ శివాజీ, నాంబళ్ళ రమేష్, రాంబాబు, శిష్టు మనోజ్ కుమార్, దుర్యోధన, పురుషోత్తం, శ్యామ్, కంచరాన లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



# రాజపురంలో తాగునీటికి ఇబ్బందులు

**- 15 రోజులుగా నీటి సరఫరా బంద్**

**- పట్టించుకోని అధికారులు**

**సంతబొమ్మాళి, ఏప్రిల్ 3(వార్త):** లింగూడు సచివా లయ పరిధి మూలపేట పంచాయతీ రాజపురంలో వేసవి ఆరంభంలోనే తాగునీటి సమస్య ప్రారంభమైంది. దీంతో మంచినీళ్ల కోసం గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. స్థానిక ప్రజలు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు మంచినీటి సమస్యపై మొరపెట్టుకున్నా స్పందించిన దాఖ లాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజపురం గ్రామస్తులు వివిధ పనుల మీద బయట గ్రామాలకు వెళ్లి నప్పుడు మంచినీరు తెచ్చుకుంటున్నామని, కొంతమంది అయితే బయటకు వెళ్లేటప్పుడు పక్క గ్రామాల్లో స్నానాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కొంతమంది నీరు తెచ్చుకోలేక, వాహనాల్లో నీళ్లు తెప్పించుకునే ఆర్థిక పరిస్థితి లేక నరకయాతన పడుతు



న్నారు. బావి నీరు బురద రంగులో రావడంతో ఇబ్బం దులు పడుతున్నామని పేర్కొన్నారు. గత 15 రోజులుగా గ్రామంలో మంచినీటి సరఫరా జరగడం లేదని పంచా యతీ అధికారుల దృష్టికి స్థానిక మహిళలు తీసుకు వెళ్లిన ప్పటికీ కనీసం సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నీటి సమస్య పరిష్కరించాల్సిన పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రజాప్రతినిధుల్లో కనీస స్పందన లేకపోవ డంతో గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆశిస్తు న్నారు. ప్రత్యామ్నాయ చర్యలు లేక రాజపురం ప్రజలకు గత 15 రోజులుగా నీటి సమస్య తీవ్రమవుతున్నది. వేస విలో నీటి సమస్య ప్రారంభమైన సమయంలో ప్రత్యా మ్నాయ చర్యలు చేపట్టేందుకు ఎటువంటి చర్యలు తీసు కోవడం లేదు. రాజపురం పొరుగు గ్రామాల నుంచి నీటిని తెచ్చుకుని పరిస్థితి ఏర్పడింది. తక్షణమే మంచినీటి సర ఫరా చేసి దాహం తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**చర్యలు చేపడుతున్నాం..**

రాజపురం గ్రామానికి మంచి నీటిని సరఫరా



చేయడానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీటి సరఫరా ఆగింది. కరెంట్ మీటర్‌కు దరఖాస్తు చేశాము, త్వరితగతిన మంచినీటిని సరఫరా చేస్తాం.

**- ఎం హరీష్, పంచాయతీ సెక్రటరీ కె.లింగూడు సచివాలయం**

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం







## ఆదర్శం.. ఆచరణీయం..

# వెంకటరావు మార్గం

✳ రూ.6కోట్లతో మూలిపాడు అభివృద్ధి చేసిన గుసిరి ✳ మహేంద్రతనయలో ప్రజల సహకారంతో కల్వర్టుతో రహదారి ఏర్పాటు ✳ భక్తుల సాయంతో శ్రీముక్తేశ్వరాలయం నిర్మాణం



















మందస, ఏప్రిల్ 3(వార్త): ఆయనో పట్టువదలని విక్రమార్కుడు.. అభివద్ధే ఆయన ధ్యేయం.. ఆదర్శమే ఆయన మార్గం.. పంచాయతీ అభివద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేసిన యువ నాయకుడు అతను.. నా పంచాయతీలో ఇది కావాలని ఆయన మదిలో మెదిలితే చాలు.. అదే చేసేవరకు ఆయన విశ్రాంతి అంటే ఏమిటో తెలియదు. అభివృద్ధి, సంక్షేమం.. రెండు కళ్లుగా చేసుకుని.. ఐదేళ్ల పాటు నిరంతరం శ్రమిస్తూ.. మూలిపాడు పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించి, ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఆయనే గుసిరి వెంకటరావు.. యువకుడైన వెంకటరావు ఆలోచనలు మాత్రం ఓ అనుభవం కలిగిన నాయకుడిలా వ్యవహరించడంతో మూలిపాడు పంచాయతీ ఆదర్శంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని మూలిపాడు పంచాయతీలో మూడు గ్రామాలున్నాయి. మూలిపాడు, శ్రీనివాసపురం, గోపాలపురం.. ఈ మూడు గ్రామాలు కూడా వెనుకబడిన గ్రామాలే. 2021వ సంవత్సరంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న త్రిముఖ పోటీలో వెంకటరావు మంచి మెజార్టీతో సర్పంచ్ గా విజయం సాధించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకునిగా పని చేసిన ఆయనకు గ్రామానికి చేసిన సేవలు కూడా కలిసొచ్చాయి. ఓ సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఉన్నత విద్యావంతుడు కావడంతో పాటు వెంకటరావు విప్లవ భావాలు కలిగిన నాయకుడు. కమ్యూనిజం సిద్ధాంతాలు, భావజాలంతో ఆయన పని చేస్తారు. సర్పంచ్ గా విజయం సాధించిన ఆయన వెనుతిరిగి చూడలేదు. కుల, వర్గ, రాజకీయాలకు అతీతంగా పంచాయతీని అభివృద్ధి చేయడం ప్రారంభించారు. సుమారు రూ.6కోట్లకు పైబడి నిధులతో మూలిపాడు పంచాయతీని అభివృద్ధి చేశారు. మహేంద్రతనయ-మెళియాపుట్టి రోడ్డులో గల ముకుందపురం నుంచి శ్రీనివాసపురం, గోపాలపురంతో పాటు సోంపేట మండలంలోని కొన్ని గ్రామాలకు మహేద్రతనయ నదిలో రహదారి ఉంది. ఎప్పటి నుంచో ఈ ప్రాంతీయులు బ్రిడ్జి కావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కానీ, కార్యరూపం దాల్చలేదు. దీంతో ఆయన వినూత్నంగా ఆలోచించారు. పెద్ద బ్రిడ్జి అయితే కట్టలేము కానీ.. శ్రీరామునికి వానరులు, ఉడతలు సాయంతో చిన్న వారధి నిర్మిస్తే... అన్న ఆలోచన ఆయన మదిలో మెదిలింది. దీంతో శాయశక్తులా కృషి చేసి, నదిలో కల్వర్టు నిర్మించేశారు. ఈ కల్వర్టు పాదచారులకు, ద్విచక్రవాహనాలు, చివరకు కార్లు, ట్రాక్టర్లుకు ఉపయోగపడింది. అదేవిధంగా సొండిపూడి నుంచి మూలిపాడుకు ఉన్న రహదారి ఆక్రమణలకు గురికాగా.. ఎంతో ధైర్యంగా వాటిని తొలగించి, రహదారి నిర్మించి, సర్వాంగసుందరంగా మార్చారు. సర్పంచ్ గా తన ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనులను ఆయన 'జాతీయవార్త'కు తెలిపారు.

**మూలిపాడు పంచాయతీలో ఎంఎన్ఆర్ఈజీఎస్, ఐటీడీఏ నిధులు, పంచాయతీ 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులతో సుమారు రూ.6కోట్ల అభివృద్ధి చేసిన పనులు ఇవే...**

1.రూ.84లక్షలతో మూలిపాడు నుండి సొండిపూడి వరకు 900మీటర్ల సీసీ రోడ్ నిర్మాణం
2.రూ.1.43కోట్లతో శ్రీనివాసపురం నుండి కర్తలపాలెం వరకు 1.5కేఎం సీసీ రోడ్ నిర్మాణం
3.మూలిపాడు గ్రామంలో 2ఎకరాలు గ్రామ కంఠంగా గుర్తించి, 42మంది లబ్ధిదారులకు(పేద,బలహీనవర్గాలు) ఇళ్ల స్థలాలు మంజూరు, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం
4.పంచాయతీలో 45కుటుంబాలకు సొంత స్థలాలలో వైఎస్సాఆర్ కాలనీ ఇళ్లు
5.150మంది లబ్ధిదారులకు కొత్తగా వైఎస్సార్ పెన్షన్లు మంజూరు
6.మూలిపాడులో ఎంపీపీ స్కూల్ నాడు-నేడు క్రింద రూ.15లక్షలతో స్కూలు అభివృద్ధి
7.మూలిపాడు గ్రామంలో ఎంపీపీ స్కూల్ చుట్టూ కాంపౌండ్ వాల్ సుమారుగా రూ.8లక్షలతో నిర్మాణం
8.పంచాయతీలో రెండు గ్రామాల్లో రూ.50లక్షలతో ఊరు చుట్టూ సీసీ రోడ్లు నిర్మాణం
9.పంచాయతీలోని మూడు గ్రామాలకు రూ.10 లక్షలతో గ్రావెల్ రోడ్లు నిర్మాణం
10.రూ.20లక్షలతో మూలిపాడు గ్రామంలో పడమర దిశగా ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తించి, చెరువు దగ్గరలో ఎస్ డబ్ల్యుపీసీ(చెత్త నుండి సంపద తయారు కేంద్రం), చుట్టూ ఇనుప కంచె, బోర్ వెల్, విద్యుత్ సౌకర్యం నిర్మాణం, అభివృద్ధి
11.గోపాలపురం, మూలిపాడు గ్రామాల్లో రూ.7లక్షలతో 250మీటర్లు సీసీ డ్రైనేజ్ నిర్మాణం
12.మూలిపాడు గ్రామంలో ప్రజల అవసరం కోసం గ్రామంలో రూ.5లక్షలతో నాలుగు హ్యాండ్ బోర్ వెల్ నిర్మాణం మంచి నీటి సరఫరా
13.ప్రజల అవసరం నిమిత్తం మూడు చోట్ల సీసీ కల్వర్టుల నిర్మించడం జరిగింది.
14.గోపాలపురం, శ్రీనివాసపురం గ్రామాలకు వెళ్లడానికి ప్రజలు సహకారంతో తాత్కాలిక వంతెన నిర్మాణం
15.శానిటేషన్, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయడం జరిగింది
16.ఎస్ డబ్ల్యుపీసీ వద్ద సుమారు రూ.3.5లక్షలతో 15విద్యుత్ స్థంబాలతో సౌకర్యం
17.ఎస్ డబ్ల్యుపీసీ-పెద్దచెరువుకు వెళ్ళే రహదారి మధ్యలో రూ.4.5లక్షలతో పెద్ద కల్వర్టు నిర్మాణం పూర్తి
18.శ్రీనివాసపురంలో సుమారు 100మీటర్లు సీసీ డ్రైనేజ్ రూ.3.5లక్షలతో నిర్మాణం
19.జగనన్నకాలనీలో రూ.2.5లక్షలతో బోరు వెల్, టబ్ నిర్మాణం
20.జల్ జీవన్ మిషన్ వాటర్ పైప్ లైన్ ఇంటింటికీ మంజూరు చేయించడం
21.మూలిపాడులో ప్రజల సహకారంతో కొంత స్థలాన్ని గుర్తించి, చెరువుకు ఆనుకొని.. దాతల డొనేషన్లతో ఎంతో ప్రతిష్టాత్మకంగా శ్రీ ముక్తేశ్వర శివాలయం నిర్మాణం పూర్తి

మూలిపాడు పంచాయతీ అభివృద్ధిలో ప్రధానంగా అప్పటి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఎంతగానో సహకరించారని వెంకటరావు తెలిపారు. పలు అభివృద్ధి పనులను శంకుస్థాపనతో పాటు పూర్తయిన పనులను ఆయన చేతుల మీదుగా ఎంతో ఘనంగా ప్రారంభించుకోగలిగామని చెప్పారు. సర్పంచ్ గా తన పదవీకాలంలో సహకరించిన ఎంపీటీసీ దడ్డ దమయంతి, ఉపసర్పంచ్ రామచంద్రమహంతి, మాజీ సర్పంచ్ గౌరహరమహంతి, దడ్డ కిరణ్ కుమార్, వార్డు మెంబర్లు, మహిళలు, ప్రజలు, యువకులకు, అధికారులు, సచివాలయం సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ రుణపడి ఉంటానని తెలిపారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546